## సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి



సాక్షి,మేడ్చల్ జిల్లా: సమాచార హక్కు చట్టం -2005 వారోత్సవాల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయి కార్యాలయాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల12 వరకు అన్ని కార్యాలయాలతో పాటు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లోనూ తప్పకుండా సదస్సులు నిర్వహించి చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలి, దీని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

## జవహర్‌నగర్‌లో వడ్డెర ఓబన్న వర్ధంతి



నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బోనాల ఏర్పాట్లపై సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర గ్రామంలో ఈనెల 12న జరిగే బోనాల పండుగ సందర్భంగా కమిషనర్ వెంకట్‌రెడ్డి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 9 గ్రామ దేవతల ఆలయాల్లో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీల నేతలు, గ్రామ పెద్దలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇన్‌చార్జితో భేటీ



మీనాక్షి నటరాజన్‌తో మధుకృష్ణ

శామీర్‌పేట: క్యాతం మధుకృష్ణ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతలపల్లి మున్సిపాలిటీలోని లక్ష్మాపూర్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ సమస్యలతో బాధపడుతున్నారని, ఈ విషయమై ఎమ్మెల్యేలతో పాటు మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించిందని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



జైపాల్‌రెడ్డి



రమేశ్

శామీర్‌పేట: డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి మున్సిపాలిటీలకు కాంగ్రెస్ అధ్యక్షులను సోమవారం ప్రకటించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి ఉద్దెమర్రి మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేశ్, అలియాబాద్ మున్సిపాలిటీకి తుంకి రమేశ్, తూంకుంట మున్సిపాలిటీకి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. అర్హులకు అందేలా కృషిచేస్తామన్నారు. తమపై నమ్మకంతో పదవులు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నిత్యావసరాల అందజేత

ఉప్పల్: ఒనపాకల గ్రూప్ అధినేత సాకేత్ తన పుట్టినరోజును పురస్కరించుకుని ఉప్పల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు కావాల్సిన నిత్యావసరాలను ఉప్పల్ ఎస్సై చిరంజీవి సమక్షంలో అందజేశారు. పాఠశాలకు నోటీస్ బోర్డు, వైట్ బోర్డు, త్రి సీటర్ చైర్, రిఫ్రిజిరేటర్, వాటర్ క్యాన్స్, స్కూల్ స్టేషనరీ,వాలీబాల్స్‌ను సైతం అందజేశారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 61 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తాకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరి ప్రియ, వివిధ శాఖల ఉన్నతాధికారుల తమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే పలు సంఘాలు, కాలనీ, బస్తీ కమిటీలు, అసోసియేషన్ల ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు

### రెవెన్యూ శాఖవే అధికం

జిల్లాలోని కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలోని 'డి' సెక్షన్‌కు సంబంధించిన 12 ఫిర్యాదులు రాగా,' ఇ'సెక్షన్‌కు సంబంధించి 8 ఫిర్యాదులు అందాయి. 16 పురపాలక సంఘాలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 3 మున్సిపల్ సర్కిళ్ల పరిధి నుంచి 16 ఫిర్యాదులు రాగా, జిల్లా గృహ నిర్మాణ శాఖకు 4 ఫిర్యాదులకు సంబంధించిన దరఖాస్తులు కలెక్టర్‌కు వచ్చాయి. అక్రమ కట్టడాలు, అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై వినతి పత్రాలు వచ్చాయి. మల్కాజిగిరి, కీసర ఆర్డీఓ పరిధికి సంబంధించి 4 ఫిర్యాదులు అందాయి. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం పలువురు, దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై వినతులు అందాయి.

### ప్రజా ఫిర్యాదులపై స్పందించాలి: జిల్లా అదనపు కలెక్టర్లు

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ప్రజల్లో విశ్వాసం, నమ్మకాన్ని పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి సమస్యలు పరిష్కారం కాగలవన్న నమ్మకంతో ప్రజలు వస్తున్నారనే విషయాన్ని మరిచిపోవద్దని సూచించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో వారికి తెలపాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు.

## కాంగ్రెస్ 'బాకీ కార్డు'పై బీఆర్ఎస్ కీలక సమావేశం

### హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ముఖ్య కార్యకర్తలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'బాకీ కార్డు' ఉద్యమాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు సీహెచ్ మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు, వివేకానంద గౌడ్, బండారి లక్ష్మా రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డితో పాటు జిల్లా ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరి, వంచనను ప్రజల్లో బట్టబయలు చేసేందుకుఏ బీఆర్ఎస్ 'బాకీ కార్డు' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వస్తోందని పేర్కొన్నారు. జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని కార్యకర్తలు, క్యాడర్‌కు వారు పిలుపునిచ్చారు. మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, డివిజన్లు, వార్డుల్లో 'బాకీ కార్డు' జయప్రదం అయ్యేలా ప్రజాప్రతినిధులతో సహా అందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ 'బాకీ కార్డు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.



## నాలాను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



నాలా డైవర్షన్ వివరాలు తెలుసుకుంటున్న డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ పరమేశ్

ఘట్‌కేసర్: అంకుషాపూర్, అవుషాపూర్ రెవెన్యూ పరిధిలోని నాలాలను ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ పరమేశ్ సోమవారం పరిశీలించారు. అంకుషాపూర్ సర్వే నంబర్ 258, 259, 161, 261, 271, 263, 264, 265, 267, 268 అవుషాపూర్‌లోని 269, 274 లోని భూమిలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నాలాలు ధ్వంసం చేసి వెంచర్ చేస్తున్నారని ఆరోపిస్తూ కొందరు హైడ్రా, ఇరిగేషన్, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. వర్షం నీరు నాలా ద్వారా ఎగువ నుంచి దిగువకు వెళ్లేందుకు నాలా డైవర్షన్ కోసం అనుమతి తీసుకుని క్షేత్రస్థాయిలో డైవర్షన్ పనులు చేపట్టలేదని డీఈ తెలిపారు. నాలా డైవర్షన్ విషయమై రియల్ ఎస్టేట్ సంస్థకు నోటీసులు అందజేస్తామని, తప్పని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## విద్యార్థినికి సన్మానం



లక్ష్మీమేఘనను అభినందిస్తున్న సుదర్శన్‌రెడ్డి, కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామానికి చెందిన బొడిగే రవీందర్‌గౌడ్ కూతురు లక్ష్మీమేఘన ఇటీవల జరిగిన నీట్ కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించింది.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డితో కలిసి విద్యార్థినిని సోమవారం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సాయిలు, వెంకటేశ్‌గౌడ్, కుటుంబీకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడకు చెందిన వెంకటరమణకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.60వేల చెక్కు మంజూరయ్యింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు.

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

### అచ్యుత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ గౌరవ అధ్యక్షుడు మర్రి వెంకటస్వామి

శామీర్‌పేట్: అధికార పార్టీ అండదండలతో భూ ఆక్రమణలకు పాల్పడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, అతని బినామీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అచ్యుత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గౌరవ అధ్యక్షుడు మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట పరిధిలోని అచ్యుత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఆ సంస్థ కార్యదర్శి కపిల్ కుమార్‌తో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ఎంపీ బినామీ ఎన్.వి రామారాజు అనధికారికంగా, అక్రమంగా డాక్యుమెంట్లను ఫోర్జరీ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. బొమ్మరాశిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 387, 389, 392 లలో 5 ఎకరాల భూమిని తమ సంస్థ పేరిట రిజిస్ట్రేషన్ ఉందని, అందులో భవనాలు నిర్మించుకున్నామన్నారు. 2018 నుంచి లియోమెరిడియన్ సంస్థకు, సిబ్బందికి లీజుకు ఇచ్చామన్నారు. అయితే ఎన్వీ రామరాజు లీజు అగ్రిమెంట్ అయిపోయినప్పకీ తమ ఆస్తిని అనధికారికంగా ఆక్రమించేందుకు డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారన్నారు. ఈ విషయమై వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎఫ్‌ఐఆర్ నమోదైందే తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. 2024 సెప్టెంబర్ 30 తో లీజు ముగిసిందని, అగ్రిమెంట్ ప్రకారం బకాయిలుగా ఉన్న రూ. 6 కోట్లు చెల్లించాలని పలుమార్లు కోరినా స్పందించలేదని, బిల్డింగ్‌ను ఖాళీ చేయాలని లేదా తిరిగి అగ్రిమెంట్ చేసుకోవాలని కోరినా మమ్మల్ని బెదిరింపులకు, భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు . కార్యక్రమంలో రైతు నాయకుడు రవికిరణ్ రెడ్డి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్యుత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ గౌరవ అధ్యక్షుడు మర్రి వెంకటస్వామి

## సీఎంఆర్ విద్యార్థికి రాష్ట్రపతి పురస్కారం



అవార్డు అందుకుంటున్న మణిసాయివర్మ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ విద్యార్థికి రాష్ట్రపతి పురస్కారం దక్కింది. మణిసాయి వర్మ ఎన్ఎస్ఎస్ ద్వారా అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. 40 లక్షల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉండగా 10 మందికి అవార్డు దక్కగా అందులో తాను ఉండడం ఆనందంగా ఉందని మణిసాయివర్మ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, అధ్యాపకులు, యాజమాన్యం విద్యార్థిని అభినందించారు.

## ప్రభుత్వాస్పత్రిలో బేబీ కిట్ల పంపిణీ

ఘట్‌కేసర్: ఓసీటీ 6 సోషల్ వెల్ఫేర్ టీం 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సోమవారం బేబీ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం బస్ టెర్మినల్‌లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు మడిపడిగే శంకర్, దర్శనం శివదీపక్, మడిపడిగే బాలకృష్ణ, కొమిరిశెట్టి శ్రావణ్, రాధారం కార్తీక్, శివ, దాసరి సాయి, సోమసాని రాజ్‌కుమార్, శివ టైసన్, మన్నె సాయి నోముల ప్రశాంత్, బేతాళ నర్సింగ్‌రావు, బల్లె సాయి, మధు, సాయిగోపాల్, ఎండీ సిరాజ్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సభ్యులు

## గుండెపోటుతో సొసైటీ డైరెక్టర్ మృతి



జిలుకర విష్ణు (ఫైల్)

శామీర్‌పేట్: శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జిలుకర విష్ణు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ నారాయణపూర్‌కు చెందిన విష్ణుకు సోమవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆదివారం తన కూతురు నిశ్చితార్థం జరిగిన మరుసటి రోజే తండ్రి మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. డీసీఎంఎస్ వైస్ చైర్మన్, సొసైటీ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి, ఇతర డైరెక్టర్లు, గ్రామస్తులు జిలుకర విష్ణు భౌతికకాయానికి నివాళులర్పించారు.



## ఎన్ఎన్ఆర్‌జీతో ఇరిసెట్ ఒప్పందం



ఒప్పందంపై సంతకాలు చేసిన ప్రతినిధులు

పోచారం: నారపల్లిలోని నల్ల నర్సింహారెడ్డి విద్యాసంస్థల ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ (ఎన్ఎన్ఆర్‌జీ)తో రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ (ఇరిసెట్) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్ కుమార్ శ్రీవాస్తవ, ఎన్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ డాక్టర్ సీ.వీ.కృష్ణారెడ్డి, ఇరిసెట్ డీన్ లోకేష్ విష్ణోయ్, ఎన్ఎన్ఆర్‌జీ ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ బీ.రవి తదితరులు సోమవారం సంతకాలు చేశారు. సహకార కార్యక్రమాల ద్వారా పలు విభాగాల విద్యార్థులు, అధ్యాపకులలో అవసరమైన నైపుణ్యాలను ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసి అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రాథమిక లక్ష్యంగా పేర్కొన్నారు.

## పనులకు నిధులు మంజూరు చేయండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఈ మేరకు సోమవారం జలమండలి ఆపరేషన్ విభాగం డైరెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాణక్యపురి, వాజ్‌పేయినగర్ సెక్షన్‌లలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సెక్షన్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రధాన కార్యాలయానికి పంపించారని చెప్పినట్లు ఆయన తెలిపారు. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో సిల్ట్ తీయడం లేదన్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలని కోరారు.

## ఆర్‌డబ్ల్యూఏను రద్దు చేయాలి

జవహర్‌నగర్: డబుల్ బెడ్రూంలలో ఆర్‌డబ్ల్యూఏ పేరుతో ప్రభుత్వం అదనపు చార్జీలను వసూలు చేయడాన్ని నిరసిస్తూ జవహర్‌నగర్, అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి సందీప్ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. ప్రతి నెల రూ.3 వేల వరకు అదనపు చార్జీలు వసూలు చేయడంతో పేదలు కష్టాల్లో కూరుకుపోతున్నారని, ఇక్కడ ఉండేవారంతా నిరుపేదలేనని, వెంటనే ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్తీసంతోష్, నర్సింగ్‌రావు, శ్రీహరిగౌడ్, విజయలక్ష్మి, నాగమణి, రజిని తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా పూజారిపాలెం గ్రామానికి చెందిన అంబాటి శ్రీను భార్య కళావతి (35) కుటుంబంతో కలిసి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలో నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం యాక్టివాపై మేడ్చల్ నుంచి అత్వెల్లికి 44వ జాతీయ రహదారిపై వెళ్తున్నారు. అదే సమయంలో మేడ్చల్‌లోని ఉమానగర్‌కు చెందిన చిట్యాల రాజిరెడ్డి (55) తన బైక్‌పై అత్వెల్లి వైపు వెళ్తుండగా రాఘవేంద్ర వైన్స్ సమీపంలో గుర్తుతెలియని కంటైనర్ వెనుక నుంచి వేగంగా వచ్చి రాజిరెడ్డి బైక్‌ను ఢీకొట్టగా అది ముందు ఉన్న యాక్టివా వాహనాన్ని ఢీకొట్టగా కిందపడ్డారు. ఈ ప్రమాదంలో అంబాటి కళావతి (35)పై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శ్రీను, మరో బైక్‌పై ఉన్న రాజిరెడ్డి తీవ్ర గాయాలపాలవ్వడంతో వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజిరెడ్డి (55) మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

శామీర్‌పేట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని శామీర్‌పేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లింగాపూర్‌తండాకు చెందిన రవినాయక్ (48) తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అక్రమంగా నిల్వ చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో సోమవారం సాయంత్రం జగ్గంగూడ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి, 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోచారంలో ఓయో భవనం సీజ్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలోని భగత్‌నగర్ ఇంటి నంబర్ 13–10/75లో అక్రమంగా ఓయో రెస్ట్ రూమ్స్ నిర్వహిస్తున్నారు. దీనిపై స్థానికులతో పాటు పలువురు నాయకుల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ కోట వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది కలిసి సోమవారం సీజ్ చేశారు. భవనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని గత నెల 25న ఇంటి యజమానికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో భవనాన్ని సీజ్ చేశారు. ఆర్‌ఐ కోట వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సాయికిరణ్, బిల్ కలెక్టర్ మధు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



భవనాన్ని సీజ్ చేసిన మున్సిపల్ సిబ్బంది

## ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని వినతి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్: పట్టణంలోని సర్వే నంబర్–145 లోని 2.29 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని మండల సీపీఎం అధ్యక్షుడు నరేశ్ కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూమి అని మండల రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు మాత్రమే అక్కడ మిగిలిందని భూమి అన్యాక్రాంతం అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పూజ, కొమురయ్య, నర్సింగ్‌రావు, రమేశ్ ఉన్నారు.

## కుషాయిగూడలో స్ట్రామ్‌వాటర్ లేన్ పనులు షురూ

కుషాయిగూడ: కుషాయిగూడ వార్డు కార్యాలయం వీధిలో సోమవారం స్ట్రామ్‌వాటర్ లేన్ పనులు ప్రారంభమయ్యాయి. వరదనీరు సాఫీగా వెళ్లడానికి సరైన వ్యవస్థ లేకపోవడంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించారు. ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంతో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్, సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్, యాదయ్య, చల్లా వెంకటేశ్, జనార్దన్, కిశోర్, సాయికిరణ్, పిట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

